తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

సర్వదర్శనానికి 12 గంటలు

హైదరాబాద్, మే28 (నమస్తే తెలంగాణ) : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతున్నది. 26 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతున్నది. సోమవారం 81,831 మంది భక్తులు దర్శనం చేసుకోగా, 34,542 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ఆదాయం రూ.4.25 కోట్లు వచ్చినట్టు టీటీడీ అధికారులు తెలిపారు. జూన్ 30 వరకు సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు వీలుగా శుక్ర, శని, ఆదివారాల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది.

పది రోజుల్లోనే 598 కేసులు

సారా తయారీపై ఉక్కుపాదం • భారీగా పట్టుబడిన బెల్లం, పటిక

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : సారా మహమ్మారిని నిర్మూలించేందుకు రాష్ట్ర ఆబ్కారీ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో నాటుసారా కనబడకుండా చేయాలని అబ్కారీ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరైక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు సారా తయారీ దారులపై పది రోజుల్లో 598 కేసులు నమోదు చేశారు. 2,659 లీటర్ల నాటు సారా, పది లక్షల విలువైన 19,477 కిలోల బెల్లం, 1,617 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. 383 మందిని అరెస్టు చేసి, 93 వాహనాలను సీజ్ చేశారు. మరో 330 మందిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశారు. 82,540 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ రిమాండ్

తప్పుడు పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్ కేసులో నిందితుడు

మనోహరాబాద్, మే 28 : తప్పుడు పత్రాలతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసిన కేసులో మెదక్ జిల్లా తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈయనతోపాటు మరో ఎనిమిది మందిని మంగళవారం రిమాండ్‌కు పంపారు. మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మోతీనగర్‌కు చెందిన సురావజ్జుల సత్యనారాయణమూర్తి, అతని భార్య స్వాతికి మనోహరాబాద్ మండలం కూచారం శివారులోని సర్వే నంబర్ 225, 226లో వెయ్యి గజాల స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన మల్లవరపు అరుణ్‌కుమార్ విక్రయించాడు. ఇందుకోసం ఆయన మరో 8 మందితో కలిసి నకిలీ పత్రాలు సృష్టించి రూ.80 లక్షలకు విక్రయించాడు. అప్పటికే ఆ స్థలం దుర్గ పేరిట ఉన్నది. కాగా, నిందితులు.. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ అనే మహిళకు డబ్బు ఎర చూపి, ఆమె ఆధార్‌కార్డును దుర్గగా మార్ఫింగ్ చేసి సురావజ్జుల సత్యనారాయణ మూర్తి, అతని భార్య స్వాతి పేరిట స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. కొనుగోలు చేసిన వారు లింక్ డ్యాకుమెంట్ల కోసం ఆరా తీయగా, వారు పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో వారు ప్లాటు వద్దకు వెళ్లి చూడగా, వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండటంతో తాము మోసపోయామని గ్రహించారు. దీంతో బాధితులు సత్యనారాయణమూర్తి, స్వాతి గత ఏప్రిల్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఎస్సై కరుణాకర్‌రెడ్డి.. గత నెలలో మొదట నలుగురిని, మంగళవారం తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ రమణతోపాటు నలుగురిని మొత్తం 9 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 101వ జయంతి

ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖుల నివాళులు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : దివంగత మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు నందమూరి తారకరామారావు 101వ జయంతిని మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, తారకరత్న, లక్ష్మీపార్వతి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ క్లబ్‌లో ఎన్టీఆర్ లిటరేచర్, సావనీర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. తెలుగు సినిమాకు ఎన్టీఆర్ గొప్ప స్ఫూర్తి అని, దూరదృష్టి కలిగిన రాజకీయ నాయకుడని ప్రధాని మోదీ ట్వీట్‌లో కొనియాడారు. ప్రధాని ట్వీట్‌కు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు స్పందించి ఎన్టీఆర్ తెర వెనుక, తెర ముందు ఓ లెజెండ్ అని ట్వీట్ చేశారు. తెలుగు జాతికి సొబగులు అద్దినవారిలో ఎన్టీఆర్ ఒకరని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తాత ఎన్టీఆర్ తనకు నిత్య స్ఫూర్తి అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు కాల్స్

- ఫేక్‌కాల్స్ వెనుక ఉగ్రవాద నెట్‌వర్క్?
- దవాఖానలు, స్కూళ్లకు ఫేక్‌కాల్స్ బెడద
- నెట్‌వర్క్‌ను ఛేదించేపనిలో ఇంటెలిజెన్స్, దర్యాప్తు సంస్థలు
- జ్యోతిబా పూలే ప్రజాభవన్, నాంపల్లి కోర్టులకూ బాంబు బెదిరింపులు
- అప్రమత్తమైన ఇంటెలిజెన్స్

మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ ఎక్కువయ్యాయి. ఒక్క మే నెలలోనే మంగళవారం వరకు తెలంగాణ ఘటనలతో కలుపుకొని సుమారు వందలాది బాంబు బెదిరింపు కాల్స్, ఈ–మెయిల్స్ వచ్చినట్టు ఇంటెలిజెన్స్, దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. తాజ్ హోటల్, ముంబై విమానాశ్రయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, తెలంగాణ ప్రజాభవన్, నాంపల్లి కోర్టులు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, బెంగళూరు, ఢిల్లీలోని దవాఖానలు, స్కూళ్లు, కాలేజీలకు ఈ బాంబు బెదిరింపు కాల్స్ ఎక్కువగా వస్తున్నాయి. ప్రస్తుతానికి కాల్స్ వచ్చిన ప్రదేశాలన్నీ జనావాసం ఎక్కువగా ఉన్నవే కావడంతో మరింత ఆందోళన కలుగుతుంది. ఈ బాంబు బెదిరింపు కాల్స్ వెనుక ఉగ్రవాదుల కుట్ర ఏమైనా ఉందేమోనని ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఇప్పటికే ఈ ఫేక్‌కాల్స్ నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రంగంలోకి దిగిందని విశ్వసనీయ సమాచారం. కాగా, బాంబు బెదిరింపు కాల్స్ వచ్చిన వెంటనే అన్నిచోట్లా భద్రతా సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫలానా చోట బాంబు ఉందని చెప్పిన ప్రాంతమంతా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టిన తర్వాతే.. ఫేక్‌కాల్‌గా నిర్ధారిస్తున్నారు. ఒకే నెలలో కావాలనే ఎందుకు బెదిరింపు కాల్స్ చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. బాంబుదాడులు జరగబోతున్నాయని ముందే ఇలాంటి హెచ్చరికలు జారీ చేస్తున్నారా? అనే అంశంపై కూడా దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి. దీంతో అన్ని రాష్ట్రాల ఇంటెలిజెన్స్ పోలీసులకు నిఘా మరింత పెంచాలని కేంద్ర హోంశాఖ నుంచి అంతర్గత ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. దీంతో అన్ని రాష్ట్రాల ఇంటెలిజెన్స్ పోలీసుల అప్రమత్తమయ్యారు.

ప్రజాభవన్, నాంపల్లి కోర్టులకు..

మంగళవారం ఉదయం మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో బాంబు పెట్టామని, కాసేపట్లో అది పేలిపోతుందంటూ పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఓ అగంతకుడి నుంచి కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ప్రజాభవన్ మొత్తం తనిఖీలు నిర్వహించారు. అణువణువునా గాలించిన తర్వాత ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క... డిప్యూటీ సీఎం అధికారిక నివాసమైన ప్రజాభవన్‌కు వచ్చి అధికారులతో మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం కుటుంబసభ్యుల క్షేమసమాచారం అడిగి తెలుసుకొన్నారు. ప్రజాభవన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సందర్శకులు, ఫిర్యాదు దారులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రజాభవన్‌కు ఫేక్‌కాల్ వచ్చిన కొద్దిసేపటికే నాంపల్లి కోర్టుల భవన సముదాయానికి మరో బాంబు బెదిరింపుకాల్ వచ్చింది. దీంతో హుటాహుటిన డాగ్, బాంబు స్క్వాడ్ అక్కడికి చేరుకొని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అక్కడ కూడా ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రశాంతంగా ఉండే రాష్ట్రంలో ఇలాంటి బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో ఇంటెలిజెన్స్ వ్యవస్థ అప్రమత్తమైంది. ఫేక్‌కాల్స్ వెనుక ఉన్న కుట్రను ఛేదించేపనిలో పడింది.

ఆర్టీసీలో 'టిమ్స్' ట్రబుల్

- సర్వర్ సమస్యతో నిలిచిన బస్సులు
- గద్వాలలో గంట ఆలస్యంగా

గద్వాల అర్బన్, మే 28 : టిమ్స్ ట్రబుల్ ఇవ్వడంతో గద్వాల డిపో నుంచి దాదాపు గంటకుపైగా బస్సులు బయటకు రాలేదు. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధులు నిర్వర్తించేందుకు డ్రైవర్లు, కండక్టర్లు, మిగతా ఉద్యోగులు మంగళవారం వేకువజామున గద్వాల డిపోకు చేరుకున్నారు. మొదటగా వివిధ రూట్లకు వెళ్లాల్సిన బస్సుల కండక్టర్లకు ఇవ్వాల్సిన టిమ్స్‌లో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. దాదాపు గంటసేపు ఒక్క బస్సు కూడా డిపో నుంచి కదల్లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న డిపో మేనేజర్ మంజుల సమస్య పరిష్కారానికి కృషి చేశారు. జియో నెట్‌వర్క్ సేవల్లో అంతరాయం ఏర్పడటంతో సమస్య తలెత్తిందని, నెట్‌వర్క్ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించినట్టు ఆమె పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేవు

- తెలంగాణ మిషన్ భగీరథ శాఖ

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలోని 4500 ఆవాసాలకు 13 వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నుంచి ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథశాఖ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని అన్ని ఆవాసాలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా తాగునీటిని సరఫరా చేశామని పేర్కొన్నది. ఎక్కడైనా విద్యుత్తు కోతలు, లీకేజీలు ఉంటే.. ఆ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో తాగునీటిని సరఫరా చేసినట్టు మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. ఈ నెల 21న 'నీళ్లు ఉన్నా..నల్లా రాదు' శీర్షికతో పత్రికల్లో ప్రచురితమైన వార్తల్లో వాస్తవంలేదని స్పష్టం చేశారు. ఎంగంపల్లి తండాకు ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారన్న విషయంలో వాస్తవం లేదని తెలిపారు.

ప్రాణాలు తీసిన కోతి.. కుక్క!

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

శాయంపేట, మే 28 : కోతి, కుక్క ఇద్దరి ప్రాణాలను బలిగొన్నాయి. రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. కోతుల గుంపును తప్పించుకునే క్రమంలో కిందపడి ఒకరు మృతి చెందాడు. బైక్‌పై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఎస్సై ప్రమోద్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన దుర్గెట్టి కుమారస్వామి (35) సోమవారం కూలి పని ముగించుకొని రోడ్డుపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా కోతుల గుంపు ఎగబడింది. తప్పించుకునే క్రమంలో సీసీ రోడ్డుపై పడిపోగా, తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బేతి బుచ్చిరెడ్డి (50) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 15న కొప్పుల గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మైలారం శివారులోని పల్లె ప్రకృతి వనం వద్ద కుక్క అడ్డు రావడంతో బండి అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

కుమారస్వామి, బుచ్చిరెడ్డి (ఫైల్)



వరంగల్‌లో ఇంట్లోకి చొరబడిన కుక్క

ఇంట్లోకి కుక్క చొరబడిందని 100కు డయల్

గిర్మాజీపేట, మే 28: వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని పోస్టాఫీసు సమీపంలో నివాసముంటున్న కొండపర్తి రాజేంద్రకుమార్ తన ఇంట్లోకి కుక్క వచ్చిందని మంగళవారం ఉదయం 2 గంటలకు 100కు డయల్ చేశాడు. ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రాజయ్య వచ్చి ఇంత అర్ధరాత్రి ఎందుకు ఫోన్ చేశావని అడగ్గా.. కుక్కను బయటకు వెళ్లగొట్టడానికని బదులిచ్చాడు. కానిస్టేబుల్ కుక్కను ఇంటి నుంచి వెళ్లగొట్టి ఇలాంటి విషయాలకు 100 డయల్‌కు కాల్ చేయొద్దని సుతిమెత్తగా మందలించాడు.

- 86 బైక్ సైలెన్సర్లు ధ్వంసం

అధిక శబ్దం వచ్చే 86 బైక్ సైలెన్సర్లను మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మొదటి బైపాస్ ప్రాంతంలో రోడ్డు రోలర్ సాయంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్‌లకు అధిక శబ్దం వచ్చేలా సైలెన్సర్లు మార్చితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. – సిరిసిల్ల తెలంగాణ చౌక్

వాణిజ్య

వెండి వెలుగులు

న్యూఢిల్లీ, మే 28: వెండి వెలుగులు పంచింది. గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి మంగళవారం ఏకంగా రూ.3 వేలకు పైగా పెరిగింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.3,100 ఎగబాకి రూ.95,950 కి చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.92,850గా ఉన్నది. వెండితోపాటు బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. తులం పుత్తడి ధర రూ.130 పెరిగి రూ.72,950కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.220 అందుకొని రూ.72,930కి, 22 క్యారెట్ ధర రూ.200 ఎగబాకి రూ.66,850కి చేరుకున్నది. కిలో వెండి మాత్రం రూ.3,500 ఎగబాకి మళ్లీ లక్ష రూపాయల పైకి చేరుకున్నది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి ధర రూ.1,01,000 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో వెండికి డిమాండ్ అధికంగా ఉండటంతో ఔన్స్ ధర 31.50 డాలర్లకు చేరుకోవడంతో దేశీయంగా ధరలు పెరిగాయి.

ధరలు పెంచిన ఎన్ఎండీసీ

న్యూఢిల్లీ, మే 28: ఎన్ఎండీసీ మరోసారి ధరలు పెంచింది. లంప్సం టన్ను ధరను రూ.250 పెంచిన సంస్థ..నాణ్యమైన ఖనిజ రకాన్ని రూ.350 సవరించింది. పెరిగిన ధరలు మంగళవారం నుంచే అమలులోకి వచ్చాయని సంస్థ తెలిపింది. దీంతో లంప్సం టన్ను ధర రూ.6,450కి చేరుకోగా, నాణ్యమైన రకం రూ.5,610 పలికింది.

అమర రాజా ఆకర్షణీయం

న్యూఢిల్లీ, మే 28: గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో రూ.230 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది అమర రాజా బ్యాటరీస్. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 62 శాతం వృద్ధిని కనబరిచింది. ఆదాయం రూ.2,433 కోట్ల నుంచి రూ.2,908 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, ప్రతిషేరుకు రూ.5.10 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది.

ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ!

- సంకేతాలిచ్చిన కంపెనీ చైర్మన్ సిద్ధార్థ

న్యూఢిల్లీ, మే 28: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ..ఆరోగ్య బీమా రంగంలోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నది. ఈ విషయాన్ని కంపెనీ చైర్మన్ సిద్ధార్థ మోహంతీ సూచనప్రాయంగా వెల్లడించారు. బీమా రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు, దీంట్లోభాగంగానే ఆరోగ్య బీమా రంగంలోకి ప్రవేశించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం బీమా చట్టం సవరించడం ద్వారా కంపొజిట్ లైసెన్స్‌ను అనుమతించే అవకాశాలున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలకు లోబడి బీమా చట్టం–1938 ప్రకారం ప్రస్తుతం లైఫ్, జనరల్ లేదా ఆరోగ్య బీమా సేవలు అందించడానికి సంస్థలకు వీలులేదు. కానీ, బీమా చట్టాన్ని సవరించే ప్రతిపాదనను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. దీంట్లోభాగంగానే ఒకే సంస్థకు అన్ని రకాల సేవలు అందించడానికి వీలుపడనున్నది. దీనిపై ఆయన మాట్లాడుతూ..ఆరోగ్య బీమా రంగంలోకి వచ్చే దానిపై అంతర్గతంగా పనులు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒకే సంస్థకు లైఫ్, జనరల్ లేదా హెల్త్ బీమా సేవలు అందించడానికి అవసరమైన లైసెన్స్‌లు మంజూరు చేయాలని పార్లమెంటరీ ప్యానెల్ సూచించిన విషయం తెలిసిందే. ఇందుకోసం బీమా చట్టాల్లో మార్పులు చేయాలని సూచించింది. ఒకేతాటిపైకి అన్ని రకాల బీమా సేవలు అందించడంతో పాలసీదారుడికి ఆర్థిక ప్రయోజనాలు కలగడంతోపాటు సమయం ఆదాకానున్నది. సింగిల్ పాలసీతో లైఫ్, హెల్త్, పొదుపు సేవలు అందించడానికి వీలు పడనున్నదని కమిటీ సూచించింది.

డెడ్‌లైన్ ఈ నెలాఖరే

మే 31కల్లా ఆధార్‌తో పాన్ అనుసంధానం కాకపోతే అధిక టీడీఎస్ కోతలు

ట్యాక్స్‌పేయర్స్‌ను హెచ్చరించిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ, మే 28: ఈ నెలాఖరుకల్లా పన్ను చెల్లింపుదారులు తమ ఆధార్‌తో పాన్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ మంగళవారం స్పష్టం చేసింది. మే 31లోగా ట్యాక్స్ పేయర్స్ తమ ఆధార్–పాన్‌ను లింక్ చేసుకోకపోతే జూన్ 1 నుంచి టీడీఎస్ అధిక రేటుతో కట్ అవుతుందని హెచ్చరించింది. కనుక అధిక పన్ను కోతల నుంచి తప్పించుకోవాలంటే ఈ శుక్రవారంలోపు ఆధార్‌తో పాన్ లింకయ్యేలా చూసుకోవాలని కోరింది. ఐటీ నిబంధనల ప్రకారం ట్యాక్స్‌పేయర్స్‌కు చెందిన పర్మనెంట్ అకౌంట్ నంబర్ (పాన్), బయోమెట్రిక్ ఆధార్‌తో అనుసంధానం జరుగకపోతే అందరికీ వర్తించే ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్ (టీడీఎస్) రేటుకు రెట్టింపు స్థాయిలో పన్ను కోతలుంటాయి. కాగా, గత నెల ఏప్రిల్‌లోనే మే 31కల్లా ఆధార్‌తో పాన్‌ను పన్ను చెల్లింపుదారులు జత చేసినట్లైతే టీడీఎస్ షార్ట్ డిడక్షన్‌కు ఎలాంటి చర్యలు ఉండబోవని కూడా ఐటీ శాఖ ఓ సర్క్యులర్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. 'దయచేసి మీ పాన్‌తో మీ ఆధార్‌ను ఈ నెల 31లోగా లింక్ చేసుకోండి. ఇలా చేసుకోకపోతే రెట్టింపు రేటుతో టీడీఎస్‌ను చెల్లించాల్సి వస్తుంది' అని ఐటీ శాఖ తమ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది.

ఎస్ఎఫ్‌టీ గడువుపై..

బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, ఫారెక్స్ డీలర్లు, సబ్–రిజిస్ట్రార్, పోస్టాఫీసులు, బాండ్లు/డిబెంచర్ల జారీదారులు, మ్యూచువల్ ఫండ్ ట్రస్టీలు, డివిడెండ్లు చెల్లించే కంపెనీలు, షేర్లను బైబ్యాక్ చేస్తున్న సంస్థలు మే 31కల్లా స్టేట్‌మెంట్ ఆఫ్ స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ ట్రాన్జాక్షన్స్ (ఎస్ఎఫ్‌టీ) రిటర్న్స్‌ను దాఖలు చేయాలని మరో 'ఎక్స్' పోస్ట్‌లో ఐటీ శాఖ కోరింది. లేకపోతే జరిమానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. గడువు దాటితే రోజుకు రూ.1,000 చొప్పున ఫైన్ పడుతుందని హెచ్చరించింది. కాగా, ఎస్ఎఫ్‌టీలతో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలను జరిపే వ్యక్తులపై ఐటీ శాఖ దృష్టి సారించడానికి వీలుంటుంది. తద్వారా పన్ను ఎగవేతలను అరికడుతుంది.

అమ్మేస్తున్నారు..

- దేశవ్యాప్తంగా 600లకుపైగా భూములు, భవనాలను గుర్తించిన కేంద్రం
- ఆసక్తి ఉన్నవారి కోసం వెబ్‌సైట్ తెచ్చామన్న టెలికం శాఖ
- దాదాపు రూ.25,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

అమ్మకానికి బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ ఆస్తులు

- 'బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు చెందిన ఆస్తులను అమ్మేస్తున్నాం. ఈ సమాచారాన్ని మీ అందరికీ తెలియజేస్తున్నాం. ఆస్తుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాం. ఆసక్తిగలవారు చూడవచ్చు' అని వివిధ మంత్రిత్వ శాఖల్లోని సంస్థలకు టెలికం శాఖ కార్యదర్శి మిట్టల్ లేఖ రాశారు.

- దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్‌కు ఆస్తులు.
- వివిధ రాష్ట్రాల్లో 530కిపైగా భవనాలు, భూములున్నట్టు గుర్తించిన టెలికం శాఖ.
- ఢిల్లీ, ముంబైల్లో మాత్రమే ఎంటీఎన్ఎల్‌కు ఆస్తులు. అయినప్పటికీ ప్రధాన ప్రాంతాల్లోనే చాలా ప్రాపర్టీలు.
- ఢిల్లీలో 48, మహారాష్ట్రలో 52 ఆస్తులను కలిగి ఉన్న ఎంటీఎన్ఎల్.

న్యూఢిల్లీ, మే 28: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలీఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మేయాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే టెలికం శాఖ దేశవ్యాప్తంగా ఈ ఇరు ప్రభుత్వ రంగ టెలికం సంస్థలకున్న ఆస్తులను గుర్తించింది. ఇందులో 600లకుపైగా భూములు, భవనాలున్నట్టు తేలింది. వీటన్నిటినీ కూడా వివిధ ప్రభుత్వ శాఖలకు, సర్కారీ సంస్థలకు, ప్రభుత్వ భాగస్వామ్యమున్న కంపెనీలకు పూర్తిగా అమ్మేయాలని చూస్తున్నారు. తద్వారా సుమారు రూ.25,000 కోట్ల ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన రూ.18,200 కోట్ల ఆస్తులను, ఎంటీఎన్ఎల్‌కు చెందిన రూ.5,158 కోట్ల విలువైన 6 ఆస్తులను అమ్మేందుకు పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ అనుమతిచ్చినట్టు కమ్యూనికేషన్స్, ఐటీపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి గత ఏడాదే టెలికం శాఖ తెలియజేసింది.

పునరుద్ధరణ పేరుతో..

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వీటి పునరుద్ధరణ పేరుతో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సంస్థాగత ఆస్తులను పూర్తిగా అమ్మేయాలని చూస్తున్నది. నిజానికి 2019లోనే ఈ తంతుకు బీజం పడింది. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పునరుద్ధరణ ప్రణాళికకు కేంద్ర క్యాబినెట్ కూడా ఆమోదం తెలుపగా.. ఇందులో ఆయా సంస్థల మిగులు భూములు, భవనాల వంటి ఆస్తుల నగదీకరణ కూడా ఉన్నది.

ప్రభుత్వ తీరుపై విమర్శలు

బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ నష్టాలకు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలే కారణమన్న విమర్శలు పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. సేవను మరిచి ఆదాయమే పరమావధిగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వాలు.. ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు స్పెక్ట్రం కేటాయింపుల్లో పెద్దపీట దక్కేలా చేశాయని మండిపడుతున్నారు. ప్రైవేట్ కంపెనీలు 5జీ, 6జీ అంటూ పరుగులు పెడుతుంటే.. ప్రభుత్వ టెలికం సంస్థలు మాత్రం 4జీ దగ్గరే పడిగాపులు కాస్తున్నాయని గుర్తుచేస్తున్నారు. రెండు సంస్థలనూ ఆదుకునేందుకు ప్యాకేజీలను ప్రకటించినా.. వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధిని సర్కారీ పెద్దలు చూపడం లేదని ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. 2019లో ఈ ఇరు సంస్థల పునరుద్ధరణకు కేంద్రం రూ.69,021 కోట్లతో